epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 150 | బుధవారం | 06.11.2024




## ఆస్పత్రులా.. పిట్టగూళ్లా..!

### ఇరుకు గదుల్లో వైద్యసేవలు

- దవాఖానాల్లో కనిపించని ఫైర్ సేఫ్టీలు
- ఏదైనా ప్రమాదం జరిగితే ఇక అంతే..!
- సర్కారు నిబంధనలు గాలికి..
- పట్టించుకోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

2 లో

జనగామ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ పక్క గల్లీల్లో కుప్పలు తెప్పలుగా ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. పిచ్చుక గూడు లాంటి ఇరుకు గదుల్లో కొన్నేళ్లుగా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. ఈ దవాఖానాల్లోనికి వెళ్లే దారి నుంచి వాటి తీరు ఎలా ఉంటుందో తెలుస్తోంది. ముందు పార్కింగ్ ప్లేస్ ఉండదు. చుట్టూ అన్ని కమర్షియల్ బిల్డింగ్స్ ఉండడం వల్ల లోపలికి గాలి, వెలుతురు సరిగా రాదు. ఫైర్ సేఫ్టీ అనే ముచ్చటే లేదు. మరి ఇలాంటి పరిస్థితులు ఉన్న ఈ భవనాల్లో ఆస్పత్రి నిర్వహణకు అనుమతులు ఎలా ఇచ్చారో వైద్య ఆరోగ్య శాఖకే ఎరుక..!



3 లో

## ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు



## కలెక్టర్ ఆదేశాలతో.. కదిలిన అధికారులు

4

- కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు



## కాంటాలు వెంటనే ప్రారంభించాలి

3

- సీపీఎం నేతల డిమాండ్



## క్రీడల్లో రాణించి మంచి పేరు తేవాలి

2

- కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య

General News




# ఆస్పత్రులా.. పిట్టగూళ్లా..!

## ఇరుకు గదుల్లో వైద్య సేవలు

- దవాఖానాల్లో కనిపించని ఫైర్ సేఫ్టీలు
- ఏదైనా ప్రమాదం జరిగితే ఇక అంతే..!
- సర్కారు నిబంధనలు గాలికి..
- పట్టించుకోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

**జిల్లా కేంద్రంలోని స్వర్ణ కళామందిర్ రోడ్డులో ఓ పేరు మోసిన దవాఖానా ఉంది. ఏన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఈ ఆస్పత్రికి అన్ని పర్మిషన్లు ఉన్నాయో.. లేవో దేవుడెరు.. కానీ.. చుట్టూ కమర్షియల్ భవనాల మధ్యలో ఉన్న ఈ హాస్పిటల్‌లోకి వెలితే.. చీకటకి గుహలోకి వెళ్లినట్టే అనిపిస్తుంది. ఇందులో ఏదైనా ప్రమాదం జరిగితే బయటకు రావడం కష్టమే..!**


**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** జనగామ జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆస్పత్రులు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్నాయి. పిచ్చుక గూళ్లలాంటి ఇరుకు గదులు.. కనీసం ఆటోలు కూడా తిరిగే స్థలం లేని దారుల్లో దవాఖానాలు ఏర్పాటు చేస్తున్న వైద్య సేవల పేరుతో రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇలాంటి ఆస్పత్రుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### జనావాసాల నడుమే...

జనగామలో ఎక్కువగా హాస్పిటళ్లు జనావాసాల నడుమే ఉన్నాయి. ప్రజలు ఎక్కువగా నివసించే బస్టాండ్ ఏరియా, గణేశ్‌వాడ, స్వర్ణ కళామందిర్ రోడ్డు, సత్రం ఏరియా, హైదరాబాద్ రోడ్డు ఏరియాల్లో చాలా ఆస్పత్రులు వెలిశాయి. ఆస్పత్రి ఏర్పాటు చేయాలంటే గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా భవనాలు విశాలంగా ఉండాలి. అయితే సదరు ఆస్పత్రులు ఏర్పాటు చేసిన అద్దె భవనాలు ఇరుకు గల్లీల్లో ఉన్నాయి. రోగులను ఏమైనా అత్యవసర పరిస్థితుల్లో బయటకు తీసుకెళ్లాలంటే విశాలమైన రోడ్లు, పార్కింగ్ స్థలాలు లేవు. ఏదైనా అనుకోని అగ్నిప్రమాదం జరిగితే నివారించేందుకు ఫైర్ సేఫ్టీలు అసలే లేవు. ఇటీవలే జిల్లా కేంద్రంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో రెండు షాపింగ్ మాల్స్, ఒక బట్టల దుకాణం కాలి బూడిదై పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం జరిగిన విషయం అందరికీ తెలిసిందే.. అయితే అదే ప్రమాదం ఇలాంటి ఆస్పత్రుల్లో అలాంటి ప్రమాదాలు జరిగితే.. ఆస్తి నష్టం విషయం దేవుడెరుగు.. ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నాన్ మెడికల్ వాళ్లవే..!

జనగామ జిల్లా కేంద్రం అయ్యాక దినదినాభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో పెద్ద పెద్ద ఆస్పత్రులు వెలుస్తున్నాయి. అయితే కొత్తగా ఏర్పాటవుతున్న ఆస్పత్రులు మెడికల్ ఫీల్డ్‌తో ఏలాంటి సంబంధం లేనివారే నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. వైద్య సేవలను వ్యాపారంగా చూస్తూ.. డబ్బులు సంపాందించాలనే లక్ష్యంతోనే హాస్పిటళ్లను పెడుతున్నారు. కొందరు డాక్టర్ల పేర్లను స్పెషలిస్టులగా బోర్డులకు తగిలిస్తూ తమ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని రోగులను చేర్చుకుంటున్నారు. ఆ డాక్టర్లు గంట.. రెండు గంటల పాటు రోగులను చూసి వెళ్లిపోతారు. ఆ తర్వాత అక్కడ పేషెంట్లకు ఏం జరిగినా పట్టించుకునే నాథుడు ఉండడం లేదు. వైద్య వృత్తితో సంబంధం లేని వారిని కూడా డ్యూటీ డాకర్లను పెట్టి నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



### పర్మిషన్లు రద్దు చేయాలి



జనగామలో ప్రైవేటు ఆస్పత్రుల హవా కొనసాగుతుంది. చిన్నిచిన్న గదుల్లో ఆస్పత్రులు, క్లినిక్‌లు నిర్వహిస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. వాటికి ఎలాంటి ఫైర్ సేఫ్టీలు ఉండడం లేదు. ఇప్పటికైనా నిబంధనలు పాటించని ప్రైవేటు ఆస్పత్రుల పర్మిషన్లు రద్దు చేయాలి.

*- బూడిద గోపి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు*

### తనిఖీలు చేపట్టాలి



ప్రైవేట్ ఆస్పత్రుల్లో చాలా వరకు అరకొర సదుపాయాలే ఉన్నాయి. ఇరుకు గదుల్లో హాస్పిటళ్లు నిర్వహిస్తూ రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టాలి. రూల్స్ ప్రకారం లేని హాస్పిటళ్లను మూసి వేయించాలి.

*- బిర్ర ఇస్తారి, చేనేత కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు*



# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ నమోదుకు నేడే చివరి రోజు

**జనగామ, మన చౌరాస్తా :** మార్చిలో జరగనున్న ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఓటర్ నమోదు ప్రక్రియకు నేడు చివరి రోజని, అర్హత కలిగిన ఉపాధ్యాయులు వెంటనే నమోదు చేసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారంలో భాగంగా జనగామ మండలంలోని జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శామీర్‌పేటలోని జడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోమారు మండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. నిజాయితీగా, ఉపాధ్యాయ సంక్షేమం , విద్యారంగ వికాసం కోసం పనిచేస్తూ అందరికి అందుబాటులో ఉండే నిరాడంబర నేతగా, సమస్యల పట్ల సంపూర్ణ అవగాహన ఉండి, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలే కాకుండా సామాజిక సమస్యలపై కూడా తనదైన శైలిలో మండలిలో ముద్ర వేశారన్నారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని తలెత్తుకునేలా చేసిన నర్సిరెడ్డి సేవలను గుర్తించి టీఎస్‌యూటీఎఫ్ మరోమారు అభ్యర్థిగా పోటీలో నిలిపిందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస రావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# క్రీడల్లో రాణించాలి

- కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ వెంకయ్య

**హనుమకొండ, మన చౌరాస్తా :** సౌత్ జోన్ యూనివర్సిటీ లాన్ టెన్నిస్ పోటీల్లో రాణించి కాకతీయ యూనివర్సిటీకి పేరు తీసుకురావాలని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ డాక్టర్ వై.వెంకయ్య అన్నారు. మంగళవారం కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో అంతర్ కళాశాల కళాశాలల లాన్ టెన్నిస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ ఔత్సాహిక క్రీడాకారులు ప్రోత్సహిస్తుందని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కిట్స్ కళాశాల అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ నుంచి పలువురు క్రీడాకారులు జాతీయ, సౌత్ జోన్, ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీల్లో రాణించారని తెలిపారు. ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని గుర్తు చేశారు. కిట్స్ కళాశాల స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ లాన్ టెన్నిస్ పోటీలకు అద్భుత స్పందన ఉందని తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల పురుషుల, మహిళల విభాగంలో నుంచి దాదాపు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి సౌత్ జోన్ పోటీలకు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో అబ్జర్వర్లు వెంకటస్వామి, అఫ్జల్, కిషన్, పవన్, ఫిజికల్ డైరెక్టర్లు ప్రభాకర్ గౌడ్, కుమార్, శ్రీధర్, పెరుమాండ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

Local News



# ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

## తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు

**మహబూబాబాద్, మన చౌరాస్తా :**


ఉద్యోగులందరూ ఐక్యంగా ఉన్నప్పుడే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం మహబూబాబాద్ జిల్లా శాఖ కార్యవర్గం ఎన్నికలు డీఆర్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగాయి. ఈ సమావేశంలో శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ 33 జిల్లాలలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా మహబూబాబాద్ జిల్లాలో సామరస్య పూర్వకంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులందరిని అభినందించారు. ఇటీవల సీఎంతో జరిగిన సమావేశంలో మార్చి నెల వరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనందున అప్పటి వరకు ఉద్యోగులు అర్థం చేసుకోవాలని కోరినట్టు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు వెనకంజ వేసేది లేదని ఆయన పేర్కొన్నారు. కాగా, ఎన్నికలలో జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ రఫీక్, కార్యదర్శిగా కొప్పు ప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్ గా వేల్పుల శ్రీనివాస్, కోశాధికారిగా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ జగదీశ్వర్, వేముల సురేష్, కృష్ణవేణి, జాయింట్ సెక్రటరీగా సదానందం, తిరుపతిరెడ్డి, డాక్టర్ ప్రియదర్శిని, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సోములాల్, పబ్లిసిటీ సెక్రటరీగా రాజేంద్రప్రసాద్, ఆఫీస్ సెక్రటరీగా గణేష్, కల్చరల్ సెక్రటరీగా సంజీవ, స్పోర్ట్స్ అండ్ గేమ్ సెక్రటరీగా మున్వర్ బేగ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా వీరన్న, శ్రీనివాస్, అప్సర్, బాషా, జ్యోత్స్న ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్, కోశాధికారి ఉపేందర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ పరమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్ మోహన్ రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, ఎన్నికల అధికారులు వేలాద్రి రాకేశ్‌రెడ్డి, కిరణ్ మహబూబాద్ తహసీల్దార్ భగవాన్ రెడ్డి, డీపీఆర్వో రాజేంద్ర ప్రసాద్, మహబూబాబాద్ జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర ఈసీ మేంబర్ చారి, కృష్ణార్జునరావు, ఎల్లయ్య, రవీందర్రావు వివిధ శాఖల గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- **జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి**

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బీఆర్ఎస్ పార్టీ పదేళ్లలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందినదని, పచ్చగా ఉన్న తెలంగాణ కాంగ్రెస్ 10 నెలల పాలనలో పదేళ్ల వెనక్కి వెళ్లిందని జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్ స్పష్టం చేశారు. మార్పు రావాలి కాంగ్రెస్ రావాలి.. అని 6 గ్యారంటీల పథకాలతో ప్రజలను మోసం చేసి, అభివృద్ధిని అర్థికపరంగా పదేళ్ల వెనక్కి తీసుకువెళ్లారని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ 40 శాతం వరకే చేశారని, రెండు పంటల రైతుబంధు మరిచారని, రేషన్ కార్డులు ఇవ్వలేదని, సర్పంచులకు పెండింగ్ బిల్లును ఇవ్వలేదని, వంట గ్యాస్, ఉచిత విద్యుత్ పూర్తి స్థాయిలో అమలు కాలేదని, చెరువు కుంటల్లో గోదావరి జలాలతో నింపలేదని, యాసంగి పంటలకు బోరు బావులు నీరు అందేది కష్టంగా మారిందని, జనగామ జిల్లా వరి పంటలో ప్రథమ స్థాయిలో ఉండేదని, మళ్లీ సాగునీటికి తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులు, మూసీ, హైడ్రా బాధితులు ఇలా ఒక్కరంటే సమాజంలో అన్ని వర్గాలను నయవంచనకు గురిచేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అంటూ ఊదరగొట్టిన రేవంత్ మూడు వందల రోజులు దాటినా సరే వాటిని అమలు చేయటం చేతకాక చేతులేత్తేశారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బోడిగం చంద్రారెడ్డి , నాయకులు సిద్ధిరాం రెడ్డి, కల్లూరి అనిల్ రెడ్డి, ఈదులకంటి ప్రతాపరెడ్డి , నరెడ్ల బాల్ రెడ్డి, గందమల్ల నరేందర్, షబ్బీర్, బాలచందర్ పాల్గొన్నారు.






# తెలుగు యూనివర్సిటీకి సోమనాథుని పేరు పెట్టాలి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ ఆదికవి, తొలి విప్లవ కవి పాల్కురికి సోమనాథుని పేరు పెట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మాజీ ఎమ్మెల్యేలు సిహెచ్ రాజారెడ్డి, వన్నాల శ్రీరాములు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్బాస్ ఆలీ, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్ధన్ సహా పలువురికి సోమనాథ కళా పీఠం విజ్ఞాపన అందచేసింది. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లా నరసింహులు విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా పాలకుర్తికి వచ్చిన పై ప్రముఖులను ప్రత్యేకంగా పీఠం కార్యవర్గం కలిసింది. ఈ మేరకు వారికి వేర్వేరుగా వినతి పత్రాన్ని అందచేసింది. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారు. తెలుగు విశ్వ విద్యాలయానికి సోమనాథుని పేరు పెట్టే విధంగా ప్రభుత్వంపై వత్తిడి తెస్తాను చెప్పారు. వినతి పత్రం అందించిన వారిలో సోమనాథ కళా పీఠం అధ్యక్షుడు డా. రాపోలు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు డా. మార్గం లక్ష్మీనారాయణ, మాచర్ల సారయ్య, దేవసాని కృపాకర్, దాసరి జనార్ధన్, గుమ్మడి రాజుల సాంబయ్య, సుంకరి భిక్షపతి, చిట్యాల యాకయ్య, మార్గం సాయి సందీప్ తేజ, మాచర్ల పుల్లయ్య, మాన్యపు భుజేందర్, పోగు శ్రీనివాస్, బైరు భార్గవ్, అశోక్, నల్లా నరసింహులు కూతురు చింతకింది అరుణ, మంజుల తదితరులు ఉన్నారు.

# పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



**జనగామ , మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడిగా జనగామ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దోర్నాల వెంకటేశ్వర్లును నియామించినట్టు ఆ సంఘం అధ్యక్షుడు వి. రాజకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దోర్నాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడం మరింత బాధ్యత పెంచినట్లుగా భావిస్తున్నట్టు చెప్పారు. జనగామ జిల్లాలోని పద్మశాలి సామాజిక వర్గ అభ్యున్నతి కోసం ప్రత్యేక కృషి చేస్తానన్నారు. మారుతున్న కాలానుగుణంగా పద్మశాలి అనుబంధ వృత్తిలో నైపుణ్యం పెంచడంతో పాటు జిల్లాలోని పద్మశాలి విద్యావంతుల యువత అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతానన్నారు. తనకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన రాష్ట్ర కమిటీ, జిల్లా, ఆయా మండలాల ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# జనగామలో చైన్ స్నాచింగ్

**జనగామ , మన చౌరాస్తా :** జనగామ జిల్లాలో చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రరీ గదిలోకి విద్యార్థి పేరుతో చొరబడిన గుర్తుతెలియని దుండగుడు లైబ్రరీ రికార్డ్ అసిస్టెంట్ ఉపేందర్ పై దాడి చేసి మెడలోని రెండు తులాల గోల్డ్ చైన్ ను ఎత్తుకెళ్లాడు. అంగవైకల్యుడైన ఉపేందర్ ప్రతిఘటించడంతో దాడి చేసి పరారయ్యాడు. ఘటనపై కళాశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయాలైన ఉపేందర్ ను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నాగపూరి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మండలంలోని నాగపురి జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి విద్యార్థిని కె.మౌనిక రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల సిద్దిపేటలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ బాలికల అండర్-17లో 400 మీటర్ల పరుగు పందెంలో రెండో బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎలికట్టె ఐలయ్య తెలిపారు. మంగళవారం పాఠశాలలో మౌనికతో పాటు పీడీ శ్రీధర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, పద్మ, నిరూపమ, అందే విజయ్ కుమార్, మనోజ్ కుమార్, ప్రకాష్ రెడ్డి, యాదగిరి, మాధవి, స్వర్ణ కుమార్, కనక లింగం, ఫాహిం సుల్తానా, రాజేశ్వరి, స్వామి పాల్గొన్నారు.






# కొనుగోలు కేంద్రాల్లో కాంటలను ప్రారంభించాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** మండలంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కాంటాలను మొదలు పెట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్ మావో డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కమలాయపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేర్యాల మండలంలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికార కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పోటీపడి ప్రారంభించారు.. కానీ 15 రోజులైనా ఇప్పటి వరకు ఏ ఒక్క రైతు ధాన్యాన్ని కొనుగోలు చేయలేదన్నారు. వరి కోతలు పూర్తి చేసుకుని రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి ఆరబోసుకొని చూస్తున్నప్పటికీ కొనుగోలు చేపట్టడం లేదన్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులకు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించి కాంటలు పెట్టే విధంగా చూడాలని అధికారులను కోరారు. లేనిపక్షంలో రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు గొర్రె శ్రీనివాస్, బట్టు నరసయ్య, శనిగరం తిరుపతి, కాలి మల్లేశం, బైటి ఎల్లయ్య, కొలుపుల ఐలయ్య, కాళీ, ఐలేని, శ్రీనివాస్, భిక్షపతి, రాజయ్య పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు...

జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం అన్ని మండలాల తహసీల్దార్లు తనిఖీలు నిర్వహించారు. ప్రతి కేంద్రంలో యంత్రాలు, రిజిస్టర్లను చెక్ చేసి కొనుగోలు కావాల్సిన వివిధ సామాగ్రిని సరిపడా తెచ్చుకున్నారని పరిశీలించారు. టోకెన్ల ప్రకారం ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయా..? లేదా.. ఎప్పటికప్పుడు కొనుగోలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా..? అని తహసీల్దార్లు పరిశీలించారు.

- మన చౌరాస్తా, జనగామ







# సర్వేకు సర్వం సిద్ధం

- మొదటి మూడు రోజులు హౌస్ లిస్టింగ్
- 9 నుంచి వివరాల సేకరణ
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వే నేటి నుంచి ప్రారంభం అవుతుందని, ఇందుకు జిల్లాలో సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం రూరల్‌లో 1,46,428, మున్సిపల్ పరిధిలో 16,084 ఇండ్లను గుర్తించామన్నారు. సర్వే కోసం రూరల్ పరిధిలో ఎన్యూమరేటర్ బ్లాక్లు 1,036 అలాగే మున్సిపాలిటీ పరిధిలో 123 ఉన్నాయన్నారు. ఈ బ్లాక్లలో సర్వే చేసేందుకు ఎన్యూమరేటర్లు మండలాలకి 1,036 మంది , మున్సిపాలిటీ కి 123 మందిని నియమించామని తెలిపారు. వీరిని మానటరింగ్ చేసేందుకు రూరల్ లో 104 మంది, మున్సిపాలిటీకి 13 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. అలాగే సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు ప్రతీ మండలానికి 30 మంది ఆపరేటర్లను కేటాయించామన్నారు. అలాగే అదనంగా 10 శాతం మంది ఎన్యూనరేటర్, సూపర్‌వైజర్లను రిజర్వడ్‌గా పెట్టుకున్నామన్నారు. సర్వేకి కావాల్సిన సామాగ్రిని అలాగే ఎన్యూమరేటర్లకు ఐడి కార్డును కూడా ఇవ్వడం పూర్తి అయ్యిందని చెప్పారు. నేటి నుంచి 8 వ తేదీ వరకు ప్రతి బ్లాక్ కి వెళ్లి హౌస్ లిస్టింగ్ చేస్తారని, 9 నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్ మేరకు ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఇప్పటి వరకు పలు దఫాలుగా ఎన్యూమరేటర్లకు మాస్టర్ ట్రైనర్ల ద్వారా సమగ్ర సర్వే మీద జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. ఈ సర్వే విజయవంతంగా జరిగేందుకు ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

**బ్యాంక్ గ్యారెంటీతోనే మిల్లర్లకు ట్యాగింగ్...**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల తీరును మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణా రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం బియ్యంగా మార్చేందుకు మిల్లర్లకు ట్యాగింగ్ కోసం బ్యాంక్ గ్యారెంటీపై మిల్లర్లతోను, బ్యాంక్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమన్వయ పరచినట్లు కలెక్టర్ వివరించారు.

